ప్రజాశక్తి
గురువారం 7 ఆగస్టు, 2025
5
శ్రీకాకుళం

ఉచిత బస్సుకు ట్రయల్ రన్

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకానికి సంబంధించి పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద బుధవారం రాత్రి విజయనగరం జోన్ నుంచి డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజినీర్ చాణిక్య ట్రైలరన్ నిర్వహించారు. అనంతరం పలాస డిపోను సందర్శించి బస్సుల పనితీరు పరిశీలించారు. కార్యక్రమంలో డిపో మెకానికల్ ఇంజినీర్ హేమంత్, కిషోర్, ఆర్‌టిసి ఉద్యోగులు పాల్గొన్నారు.

ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఆర్‌టిసి అధికారులు

ఉపాధి ఊరింపేనా..?

- నియోజకవర్గానికో పార్కు ఏర్పాటు చేస్తామని హామీ
- కార్యరూపం దాల్చని ఎంఎస్ఎంఇ పార్కులు
- భూసేకరణే ప్రధాన సమస్య
- పేదల వ్యతిరేకతతో డి-పట్టా భూములపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

రాష్ట్రంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పన 175 ఎంఎస్ఎంఇ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్) పార్కులు ఏర్పాటు చేస్తాం... 20 లక్షల ఉద్యోగాలు సృష్టించడమే తమ లక్ష్యమంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఏడాది మే ఒకటో తేదీన నెల్లూరు జిల్లాలో ఎంఎస్ఎంఇ పార్కుల ప్రారంభ సందర్భంగా అన్న మాటలివి. రాష్ట్రంలో కాస్తాకూస్తో ఈ ప్రయత్నం జరుగుతున్నా, జిల్లాలో ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఎంఎస్ఎంఇ పార్కుల కోసం భూముల సేకరణ పెద్ద సమస్యగా మారింది. దీంతోపాటు అటు ప్రభుత్వమూ పెద్దగా దృష్టిసారించకపోవడంతో, ఇప్పటివరకు సేకరించిన భూములనూ ఖరారు చేసే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా నియోజకవర్గానికి ఒక్కో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేయాల్సిన నేపథ్యంలో అధికారులు కొంతమేర కసరత్తు మొదలుపెట్టారు. నియోజకవర్గంలో భూమి లభ్యతను బట్టి ఏదో ఒకచోట ఎంఎంఎస్ఇ పార్కులు ఏర్పాటు చేసే దిశగా చర్యలు మొదలుపెట్టారు. పలాస నియోజకవర్గానికి సంబంధించి పలాస మండలం రామకృష్ణాపురంలో 60.84 ఎకరాలను సేకరించారు. ఇండస్ట్రియల్ పార్కు కోసం 2023 మార్చిలోనే ఈ భూమిని ఎపిఐఐసి అప్రూవల్ చేసింది. రోడ్లు, కాలువలు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కోసం రూ.3.50 కోట్ల వర్క్ ఆర్డర్‌ను ప్రభుత్వం ఇప్పటికే మంజూరు చేసింది. పాతపట్నం నియోజకవర్గంలోని మెళియాపుట్టిలో ఇండస్ట్రియల్ పార్కు కోసం 2019లో 64 ఎకరాలను సేకరించారు. అందులో మొదటి దశలో 17.60 ఎకరాల్లో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేసేందుకు ఎపిఐఐసి నిర్ణయించింది. ఇక్కడ లేఅవుట్‌ను కూడా అప్రూవల్ చేసి మౌలిక వసతుల కల్పన రూ.2.50 కోట్ల వర్క్ ఆర్డర్‌ను మంజూరు చేసింది. శ్రీకాకుళం నియోజకవర్గంలోని శ్రీకాకుళం మండలం పాత్రునివలసలో 60 సెంట్ల స్థలాన్ని సేకరించారు. ఇందులో ఫ్యాక్టరీ కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపట్టనున్నారు. పనుల కోసం రూ.3.92 కోట్ల వర్క్ ఆర్డర్‌ను ఎపిఐఐసి మంజూరు చేసింది.

భూ కేటాయింపులు వారికేనా?

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు సంబంధించి పలాస, పాతపట్నం, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో భూసేకరణ పూర్తి కావడం, మౌలిక వసతులకు వర్క్ ఆర్డర్ మంజూరు చేయడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఎటువంటి అవరోధాలు లేనట్టే. ఎపిఐఐసి భూములు కేటాయించడమే తరువాయి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరికి సిఫార్సు చేస్తే వారికే దక్కుతాయనే ప్రచారం సాగుతోంది. ఇప్పటికే కొంతమంది పారిశ్రామికవేత్తలు ప్రజాప్రతినిధుల చెవిలో ఓ మాట వేసినట్లు తెలుస్తోంది. భూములు ఎవరికి దక్కినా పరిశ్రమల్లో ఉద్యోగాలు మాత్రం తమకు వస్తే చాలని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. పైడిభీమవరం పారిశ్రామికవాడతో పాటు జిల్లాలో పలుచోట్ల ఉన్న ఇండస్ట్రియల్ పార్కుల్లో స్థానికుల కంటే బీహార్, ఒడిశాకు చెందిన యువకులే పనిచేస్తున్నారు. బీహార్, ఒడిశా నుంచి వచ్చిన వారికి తక్కువ జీతం చేతిలో పెట్టినా, కార్మిక చట్టాల ప్రకారం వారికి అమలు చేయాల్సినవి చేయకపోయినా వారు నోరెత్తరని పారిశ్రామికవేత్తల భావనగా ఉంది. అందుకే స్థానిక యువత కంటే వారికే ప్రాధాన్యం ఇస్తున్న సందర్భాలు అన్ని చోట్లా ఉంది. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఇ పార్కుల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం కల్పించాలని అంతా కోరుతున్నారు.

డి-పట్టా భూములు ఇచ్చేందుకు నిరాకరణ

ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటు కోసం అధికారులు డి-పట్టా, అసైన్డ్ భూములనూ సేకరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఒత్తిడితో కొన్నిచోట్ల పేదల భూములను పార్కుల కోసం పరిశీలించారు. భూములు ఇచ్చేందుకు ముందుకొస్తే వారికి కొంత పరిహారం చెల్లించి తీసుకోవాలని భావించారు. పేదల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటి జోలికి వెళ్లలేదు. నరసన్నపేట మండలం జమ్ము ప్రాంతంలో 38.18 ఎకరాలను సేకరించాలని మండల రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా భావించారు. తాతతండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి పైనే బతుకుతున్న తాము భూమి ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సైతం రైతులు వినతిపత్రం అందించారు. దీంతో అధికారులు వెనక్కి తగ్గారు. అటు ఎపిఐఐసి ఉన్నతాధికారులు కూడా దానికి ప్రత్యామ్నాయంగా భూమిని గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు. కవిటి మండలం రాజపురంలో ఎంఎస్ఎంఇ పార్కు కోసం 29.17 ఎకరాల డి-పట్టా భూమిని సేకరించాలని నిర్ణయించారు. పేదల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నారు. టెక్కలి నియోజకవర్గంలోని టెక్కలి మండలం అడ్డుకొండలో 30 ఎకరాల డి-పట్టా, ఆమదాలవలస మండలం విఆర్ గూడెంలో 30 ఎకరాల డి-పట్టా భూమిని ఎంఎస్ఎంఇ పార్కుల కోసం సేకరించాలని చేసిన ప్రయత్నాలను పేదలు అడ్డుకోవడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ప్రస్తుతం నాలుగు నియోజకవర్గాల్లో భూసేకరణ పెండింగ్‌లో ఉంది.



కడలి మిగిల్చిన కడుపు కోత

శ్రామిక కుటుంబాల్లో పుట్టి, చదువుతో భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని కలలుగన్న ముగ్గురు విద్యార్థుల కలలు కడలిలో కలిసిపోయాయి. మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో భావనపాడు సముద్ర తీరానికి సరదాగా గడిపేందుకు వెళ్లిన ముగ్గురు యువకుల కుటుంబాల్లో కడలి కడుపు కోత మిగిల్చింది. గల్లంతైన ముగ్గురు యువకులు విగత జీవులుగా తీరానికి కొట్టుకొచ్చారు. వారి మృతదేహాల వద్ద తల్లిదండ్రుల రోదనలతో... ప్రశాంతమైన భావనపాడు తీరంలో విషాదం అలముకుంది.

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం

దుర్యోధన జశ్వంత్ రాజేష్ మృతదేహాలు

మండలంలోని భావనపాడు తీరంలో సరదాగా గడిపేందుకు వచ్చిన వజ్రపుకొత్తూరు మండలం మడేవానిపేటకు చెందిన దున్న దుర్యోధన (18), పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల జశ్వంత్ (18), పలాస మండలం టెక్కలిపట్నాణాకి చెందిన రాయల రాజేష్ (18) మంగళవారం గల్లంతయ్యారు. ముగ్గురూ విజయనగరం జిల్లాలో బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా మూడో సంవత్సరం చదువుతున్నారు. సెలవులపై ఇంటికి వచ్చి సముద్ర తీరానికి వెళ్లారని వారి స్నేహితులు తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసు సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తిమ్మల జస్వంత్ మృతదేహం తీరానికి చేరుకుంది. రాత్రి 1.45 సమయంలో రాయల రాజేష్ మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. దున్న దుర్యోధన మృతదేహం బుధవారం మధ్యాహ్నం 2.30 సమయంలో జెట్టి సమీపానికి చేరుకుంది. పిల్లల మరణవార్త వినగానే ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. తమ కుమారులను చూసిన తల్లిదండ్రుల రోదనలు ఘటనా స్థలాన్ని శోకసంద్రంగా మార్చాయి. మతదేహాలను గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్వగ్రామంలో యువకుల అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు వచ్చారు. మృతదేహాల వద్ద తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించడం పలువురిని కంటతడి పెట్టించింది.

దుర్యోధన తండ్రి మాధవరావు ఉపాధి కోసం దుబాయ్ వెళ్లారు. తల్లి సీతమ్మ వ్యవసాయ కూలీగా పనిచేస్తుంది. కొడుకు సముద్రానికి వెళ్తానంటే తాను ఒప్పుకోలేదని, అయినా పోయాడని, ఇప్పుడు కడుపుకోత మాత్రమే మిగిలిందని కన్నీళ్లతో వాపోయింది.

జస్వంత్ తల్లిదండ్రులు వల్లభరావు, సుధలు వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు. 'వెళ్లొద్దురా బాబు' అని ఎంత చెప్పినా వినకుండా, చివరగా నవ్వుతూ బయల్దేరిన కుమారుడు ఇలా కనిపించకుండా పోతాడని ఊహించలేకపోయామని వాపోతున్నారు.

రాజేష్ తల్లిదండ్రులు శివ, జ్యోతి టెక్కలిపట్నంలో నివాసం ఉంటున్నారు . వ్యవసాయ కూలీలైన వీరికి రాజేష్ ఒక్కగానొక్క కొడుకు. చదువు పూర్తి చేసి ఉద్యోగం చేస్తాడని భావించిన తల్లిదండ్రులకు ఇప్పుడు దిక్కు తెలియని స్థితిలో ఉన్నారని బంధువులు రోదిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న భావనపాడు యువత

యువకుల గల్లంతు కావడంతో వారి ఆచూకీ కోసం దాదాపు 23 గంటల పాటు భావనపాడు యువకులు, మత్స్యకారులు గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. మెరైన్ పోలీసులు, నౌపడ పోలీసు సిబ్బందికి సహాయంగా రాత్రంతా తీరంలో గల్లంతైన యువకుల మృతదేహాలు కోసం కలియతిరిగారు. ఒడ్డుకు చేరిన మృతదేహాలకు పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు చూపించారు. యువకులు గొరకల ఆదినారాయణ, బి.తులసీదాసు, బత్తిన పకీరు, కారాడ చంద్రయ్య, అడ్లదానయ్య, నాలి రమేష్, కారాడ రాజారావు, బయ్య గురువులు, సింహాచలం, ఉపేంద్రరావు, భీమారావు, పాలయ్య గాలింపు చర్యలు పాల్గొన్నారు. టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ హేమసుందర్, మెరైన్ సిఐ రాము, నౌపడ ఎస్ఐ నారాయణస్వామి గాలింపు చర్యల్లో పాల్గొన్నారు.

రోదిస్తున్న తల్లిదండ్రులు

సకాలంలో 'మూలపేట' పునరావాస గ్రామం పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మూలపేట పోర్టు పునరావాస గ్రామం సకాలంలో పూర్తి కావాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పోర్టు నిర్మాణం, పునరావాస కాలనీ అంశాలపై జిల్లాస్థాయి కమిటీ సమీక్షా సమావేశం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించారు. పునరావాస గ్రామాల నిర్మాణం, స్థలాల కేటాయింపు, మౌలిక వసతులు, గృహ నిర్మాణాలు, తాగునీటి సరఫరా వంటి అంశాలపై చర్చించారు. తాగునీటి సరఫరా, రహదారి అనుసంధానం, పునరావాస ప్రక్రియ, గ్రామాల పరిధిలోని ఖాళీ స్థలాల వినియోగం వంటి అంశాలపై సమీక్షించారు. పోర్టు రహదారికి సంబంధించిన న్యాయపరమైన అంశాలు, రైల్వే మార్గంలో చేయాల్సిన సాంకేతిక మార్పులపై సమీక్షించారు. ఇతర శాఖల సమన్వయంతో చేపడుతున్న పనుల వివరాలను అధికారులు కమిటీకి సమర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరితగతిన నిర్మాణాలు జరగాలన్నారు. నిర్మాణంలో మౌలిక వసతులు, ఇంటి నిర్మాణాలు పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. ప్రమాణాలు పాటించాలన్నారు. నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఎ ప్రాజెక్టు అధికారి కిరణ్ కుమార్, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్య, ఆరోగ్యంపై శ్రద్ధ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించే విధంగా ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా నరసన్నపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సచివాలయం 4 పరిధిలోని చిన్న బొరిగివలస, దేశివానిపేట అంగన్వాడీ కేంద్రాలు, ప్రజా పంపిణీ వ్యవస్థ, నిత్యావసర దుకాణాల సరుకుల పంపిణీని బుధవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని రేషన్ దుకాణంలో సరుకుల పంపిణీలో కొలతలు ఏమైనా తేడా ఉన్నదా? ఎంత మేర సరుకులు నిల్వ ఉన్నవి తదితర అంశాలపై నిశితంగా చూశారు. ప్రజలకు సులువుగా అర్థమయ్యేలా సరుకుల పంపిణీని సూచిక పట్టికలో వివరాలు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, కోడిగుడ్ల నిల్వలు సక్రమంగా ఉన్నవి లేనిది తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని, వంటకాలను ఆహార భద్రతాధికారి కె.లక్ష్మితో తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నాణ్యమైన విద్య, మంచి పౌష్టికాహారం అందేవిధంగా పర్యవేక్షించేందుకు ఆహార కమిషన్ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆకుకూరలు, సాంబార్లో క్యారెట్ ఉండే విధంగా జాగ్రత్తలు పాటించాలని కోరారు. రేషన్ దుకాణంలో సరుకుల నిల్వలు, రిజిస్టర్‌ల నిర్వహణను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లోని సరుకుల వివరాలు, గోదాంలోని సరుకులు తూనిక ప్రకారం సరిపడా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. స్వయంగా విద్యార్థులను వడ్డించి రోజూ మెనూ ప్రకారం సక్రమంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నది లేనిది పరిశీలించారు. విద్యార్థులకు వండిపెట్టిన గుడ్లు రంగు మారడాన్ని గుర్తించి సంబంధిత గుడ్లు సరఫరా ఏజెన్సీతో మాట్లాడి ఎప్పటికప్పుడు నాణ్యమైన గుడ్లను సరఫరా చేయాలని సూచించారు. విద్యార్థులకు వంటకాల వడ్డించే ముందు ఆహార నాణ్యతను తప్పకుండా పరిశీలించాలని హెచ్ఎంను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి గుంట సూర్యప్రకాష్, తూనికలు కొలతల అధికారి ఎ.బలరాం, నోడల్ అధికారి పి.మణిమ్మ, ఎంఇఒ డి.శాంతారావు, గర్ల్స్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.రమాదేవి, మధ్యాహ్నం భోజన పథకం పర్యవేక్షకులు డి.కూర్మారావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పైడి వెంకటరావు, సిడిపిఒ ఆర్.శోభారాణి, పౌర సరఫరాల ఉప తహశీల్దార్లు రామకృష్ణ, జాఫర్ షరీఫ్ పాల్గొన్నారు.

భోజనాన్ని వడ్డిస్తున్న శాంతారావు

12న మెగా జాబ్‌మేళా

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఈ నెల 12న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నరసన్నపేట పద్మావతి కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నామని, నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, టీం లీజు, డిక్సన్ టివి, తోషిబా, తదితర 11 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని 500 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు వివరించారు. ఎస్-ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న నిరుద్యోగ యువతి యువకులు అర్హులని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, హైదరాబాద్, శ్రీసిటీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో కలిసి మేళా ప్రాంగణానికి రావాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9949900672, 6301046329 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ప్రాథమిక ప్రాణరక్షణ, గుండె పునరుత్తేజం (సిపిఆర్) విధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ శిబిరంలో విపత్తు నిర్వహణపై కూడా శిక్షణ ఇచ్చారు. మొత్తం 157 మంది స్వచ్ఛంద సేవకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర సీనియర్ యాజమాన్యం, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచనల మేరకు, రాబోయే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం రెడ్‌క్రాస్ పర్యావరణ పరిరక్షణ దళం సభ్యులు మూడు రోజులుగా సాధన చేస్తున్నారు. మూడవరోజు సాధన శిబిరం మహిళల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు.

అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

గంజాయితో నలుగురు అరెస్టు

21.5 కిలోలు స్వాధీనం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు సిఐ పి.సత్యనారాయణ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఐ ఎస్.బాలరాజుకు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు పురపాలక సంఘం పరిధిలోని 18వ వార్డు కంద్రపేట వద్దనున్న శ్మశాన వాటిక వద్ద ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఇద్దరు యువకులు, ఒక మైనర్ గంజాయితో పట్టుబడ్డారని, వీరి వద్ద నుంచి 21.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో పట్టణంలోని కొత్త కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, ఐదోవార్డు సొట్టవానిపేట టిజిఆర్ నగర్ కాలనీకి చెందిన చెందిన సయ్యద్ తహీర్ బాబుతో పాటు ఒక మైనర్‌ను, ఒడిస్సా రాష్ట్రం బరంపురం దగ్గరలోని కళ్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. పోలీసుల విచారణలో వీరు గంజాయిని ఒడిషా రాష్ట్రం కళ్లికోట్‌కు చెందిన నీలాంచల్ పట్నాయక్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసి రైలుమార్గం ద్వారా ఆమదాలవలసకు గంజాయిని తరలిస్తూ కొంత మొత్తం వీరు సేవిస్తూ, మరికొంత మొత్తాన్ని విక్రయిస్తూ ఉండేవారని పేర్కొన్నారు. నిందితుడు కారుణ్య జగదీష్‌పై ఇప్పటికే 9 కేసులు నమోదయ్యాయని, 2024లో గంజాయి కేసు నమోదు అయిందని, ఈయనపై స్టేషన్‌లో హిస్టరీ సీట్ కూడా ఉన్నట్లు తెలిపారు. అలాగే సయ్యద్ తహీర్‌పై రెండు దొంగతనాల కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. మైనర్ వ్యక్తిపై మూడుసార్లు దొంగతనం కేసు నమోదు అయ్యాయని, మైనర్ ఇదివరకే అబ్జర్వేషన్ హోంకు వెళ్లి బయటకు వచ్చినట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. స్థానికంగా ఈ ఘటనపై తీవ్ర చర్చ నెలకొంది. యువత గంజాయికి లోనవుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐ సత్యనారాయణ

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

రూ.1.20 లక్షల నగదు అపహరణ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ కెటి రోడ్డు బాలాజీ సెల్ ఫోన్ దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. దుకాణంలోని రూ.1.20 లక్షల నగదు అపహరించారు. కాశీబుగ్గ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణతర్లకు చెందిన నిమ్మన షణ్ముఖరావు కాశీబుగ్గ కెటి రోడ్డులో బాలాజీ సెల్‌ఫోన్ సర్వీసింగ్ సెంటర్ దుకాణం 15 ఏళ్లుగా నడుస్తోంది. గత రెండు నెలలుగా సెల్ ఫోన్ సర్వీసింగ్ దుకాణం ముందు తాత్కాలిక టిఫిన్ దుకాణం కూడా పెట్టారు. ఇదిలా ఉండగా బుధవారం ఉదయం ఆరు గంటల సమయంలో టిఫిన్ దుకాణం తెరిచేందుకు నిమ్మన షణ్ముఖరావుతో పాటు వాళ్ల అన్నయ్య యువరాజ్ వచ్చారు. పక్కనే ఉన్న సెల్‌ఫోన్ సర్వీసింగ్ దుకాణానికి వేసిన తాళాలు పగల కొట్టి టిఫిన్ దుకాణం సమీపంలో పడి ఉండడం చూశారు. వెంటనే దుకాణం యజమానికి ఫోన్‌లో సమాచారం అందజేశారు. యజమాని వచ్చి పరిశీలించి వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలాన్ని కాశీబుగ్గ సిఐ సూర్యనారాయణ, శ్రీకాకుళం క్లూస్ టీం పరిశీలించి వేలి ముద్రలను సేకరించారు. అదే సమయంలో కెటి రోడ్డు స్టైలిస్ట్ టైలరింగ్ దుకాణంలో చోరీ జరిగింది. కేవలం కుట్టిన మూడు జతల బట్టలు దొంగ తనం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అక్కడా క్లూస్ టీం వేలిముద్రలను సేకరించారు. సిఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశీలిస్తున్న సిఐ, క్లూస్ టీమ్

డాక్యుమెంట్ మిస్సింగ్

పిన్నింటి సురేష్, S/o అప్పలస్వామి, దన్నుపురం గ్రామం, హిరమండలం మండలం

నా యొక్క లాండ్ డాక్యుమెంట్ నంబర్ 197/2000 తేదీ 15-07-2025 (మంగళవారం) దన్నుపురం నుంచి హిరమండలంకి ఆటోలో వెళ్తుండగా మార్గ మధ్యలో పోయింది. ఎవరికైనా దొరికిన యెడల హిరమండలం పోలీస్ స్టేషన్‌కి గాని కింది ఫోన్ నెం: కి గాని తెలియచేయగలరు.

ఫోన్ నెంబర్: 7894487115

CORRECT NAME

VANUMU CHINNAVADU @ VANUMU CHINNARAO S/O late Appalasuri, Aged 55 years, resident of Door No. 2-112, Yaata veedhi, Etcherla village, and mandal Srikakulam District,

my name is **VANUMU CHINNAVADU** in my Aadhar card No. 6345 7315 3184, but in my son's Educational Certificates is **VANUMU CHINNARAO** the above names are one and the same, vide Affidavit Notary Srikakulam A.P

సూర్యనారాయణకు చెక్కు అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

హోంగార్డుల ఐక్యతకు నిదర్శనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో గత నెలలో ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు బి.సూర్యనారాయణకు జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి చేతులమీదుగా బుధవారం వందే హోంగార్డుల కంట్రిబ్యూషన్ ఆర్థికసాయం అందించారు. విధి నిర్వహణలో ఉండి ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన హోంగార్డులకు సహచర హోంగార్డులు ఐకమత్య భావంతో తోటి హోంగార్డు కుటుంబానికి సహాయపడాలని వారి ఒక్కరోజు గౌరవ వేతనాన్ని సమకూర్చి అందజేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ క్రమంలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత హోంగార్డు బి.సూర్యనారాయణకు ఒక్కరోజు గౌరవ వేతనం సుమారు రూ.4.8 లక్షలు చెక్కును పోలీస్ కార్యాలయంలో అందజేశారు. ఎస్‌పి మాట్లాడుతూ నగదును కుటుంబ అవసరాలు, పిల్లల, కుటుంబ అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సిహెచ్.గోపీనాథ్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

శివారు భూములకు సాగునీరందించాలి

రణస్థలం రూరల్: వారం రోజుల్లో శివారు భూములకు తోటపల్లి నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం తోటపల్లి అధికారులతో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ ఏడాది ఎట్టి పరిస్థితిల్లో రైతులకు వ్యవసాయ పనులకు నీరు అందించాలని సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను ఫోన్‌లో కోరారు. సమావేశంలో డిఇఇ లావణ్య, జెఇ, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎంపిపి

గిరిజన భవనం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల కేంద్రంలో గిరిజన భవనం ఏర్పాటు చేయాలని మాజీ ఎంపిపి గిరిజన సంఘ నాయకులు బైరిసింగి లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అధికంగా గిరిజనులు ఉన్న మండలం మెళియాపుట్టి అని, అటువంటి మండల కేంద్రంలో గిరిజన భవనం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే స్పందించి సమస్య పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు బైరిసింగి ధరణి, గిరిజన సంఘ నాయకులు జన్ని ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మార్కెట్ ప్రారంభం

పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో పాత పెట్రోల్ బంకు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మార్కెట్‌ను ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నరసన్నపేట వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, సాసుపల్లి కృష్ణబాబు, బోయిన సతీష్, చలపాక మల్లి, బతకల సంతోష్, బోయిన నరసింహమూర్తి పాల్గొన్నారు. అలాగే టిడిపి కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల నియామకం నియోజకవర్గ అబ్జర్వర్ కోయిలాడ వెంకటేష్, మండల అబ్జర్వర్ నందివాడ గోవిందరావు సమక్షంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, శిమ్మ చంద్రశేఖర్, అడపా చంద్రశేఖర్, పుతి రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పాగోటి ఉమామహేశ్వరి, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, ఇసా అప్పారావు, పంగ మహేశ్వరనాయుడు, బలగ ప్రహర్ష పాల్గొన్నారు.

'ఐతమ్'లో వైద్య శిబిరం

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యాన కిమ్స్ ఆస్పత్రి, శ్రీకాకుళం సహకారంతో 'హృదయ సంబంధిత వైద్య పరీక్షల శిబిరం' బుధవారం నిర్వహించారు. ఉద్యోగులకు ఉచితంగా బిపి, సుగర్, ఇసిజి, టుడి-ఎకో వంటి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథులుగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ కళాశాలలో ఇటువంటి శిబిరాలు నిర్వహించడం వల్ల సిబ్బంది ముందుగానే తమ ఆరోగ్య పరిస్థితులు తెలుసుకోవచ్చునన్నారు. దీని ద్వారా ముందు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్య సమస్యలు నుంచి బయట పడొచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యులు సత్విక్, క్యాంప్ కో-ఆర్డినేటర్లు గోపి, రాజశేఖర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఎస్.వి. మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

రణస్థలం : మాట్లాడుతున్న వైద్యులు జనార్దనరావు

ప్రజాశక్తి- రణస్థలం

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని పిహెచ్‌సి వైద్యులు జనార్దనరావు అన్నారు. బుధవారం కొండములగాం, చిలకపేట అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు జనార్దనరావు పాల్గొని మాట్లాడుతూ తల్లిపాలతో పిల్లలకు ఆరోగ్యమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టాలని, తల్లిపాలతో రోగనిరోధక శక్తి అధికంగా ఉండి తల్లిబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం ఇస్తుందని తెలిపారు. కార్యక్రమంలో చిలకపేట అంగన్వాడీ కార్యకర్త బి.స్వాతి, కొండములగాం అంగన్వాడీ కార్యకర్త ఆర్.అప్పమ్మ, ఎఎన్‌ఎం వెంకటమ్మ పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: జాతీయ సేవా పథకంలో భాగంగా కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కుర్మాన వినోద్ కుమార్ మాట్లాడుతూ తల్లి బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యం మెరుగుగా ఉంటుందని, పిల్లలకు కూడా ఇన్‌ఫెక్షన్లు, డయేరియా వంటి సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డిన్ డాక్టర్ కె.మోషా, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బూర్జ: మండల కేంద్రమైన బూర్జలో తల్లిపాల వారోత్సవాలను సూపర్‌వైజర్ రత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాలు బిడ్డలకు ఎంతో శ్రేష్టమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు రాధిక, అన్నపూర్ణ, ఈశ్వరమ్మ, ఆయాలు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

పలాస: పుట్టిన బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠంగా పనిచేస్తుందని టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ అన్నారు. మండలంలోని చిన్న గురుదాసుపురం అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన గర్భిణుల సీమంతం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒ పార్వతి, సూపర్‌వైజర్ యు.లత పాల్గొన్నారు. అలాగే కిష్టుపురంలో టిడిపి నాయకులు బూరెల కృష్ణంరాజు, బూరెల తులసి అంగన్వాడీ కార్యకర్తలకు పోష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక వర్ధన్ నర్సింగ్ కాలేజ్ డైరెక్టర్ పి.మోహనరావు ఆధ్వర్యాన తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తమ కాలేజీ నుంచి విద్యార్థులు ప్రధాన రోడ్డులోని కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. తల్లిపాలుతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి ఆధ్వర్యాన బెల్లుపడ కాలనీ, చిన్నమేదరవీధి, రథంవీధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి గువ్వాడ సౌజన్య, టిడిపి ప్రతినిధి సంతోష్‌కుమార్ రథో, సూపర్‌వైజర్

బూర్జ : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రత్నం

ఇచ్ఛాపురం : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న పిఒ రాజేశ్వరి

సుజాత, అంగన్వాడీ కార్యకర్తలు ఎస్.కోములంగి, పుష్పాంజలి, లాలిత్య, ఆశావర్కర్ ఇంద్రాణి పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

పట్టణంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలిక వివాహాన్ని ప్రాజెక్టు అధికారి రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి వివాహాన్ని నిలుపుదల చేశారు.

గర్భిణులకు సీమంతాలు

కవిటి: పౌష్టికాహారంతో పండంటి బిడ్డ లభిస్తుందని అంగన్వాడీ కార్యకర్తలు తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని కవిటి సచివాలయం – 1,2,3, జగతి, పెద్ద మెళియాపుట్టుగ అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నందిగాం : తెంబూరు సెక్టార్ పరిధిలో సూపర్‌వైజర్ శారదాబాయి తల్లిపాటు ఆవశ్యత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎస్.వసంతకుమార్, కె.ధర్మారావు, అంగన్వాడీ కార్యకర్తలు ఆదిలక్ష్మి, నీరజ జోత్స్న పాల్గొన్నారు.

'ఉపాధి' సిబ్బందికి శిక్షణ

ఇచ్ఛాపురం : మండల పరిషత్ కార్యాలయంలో కవిటి, ఇచ్ఛాపురం మండలాలకు సంబంధించిన సాంకేతిక సహాయకులకు, క్షేత్ర సహాయకులకు ఎపిడి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం శిక్షణ ఇచ్చారు. ముఖ ఆధారిత హాజరు, ఇఎంఎస్ ద్వారా హాజరు పంపడం, సెక్యూరిటీ లాగిన్, యుక్తధార అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎపిఒలు శ్రీనివాస్, మోహన్, ఎంపిడిఒ రామారావు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

టెక్కలి: ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు విలువైనది ఓటు హక్కు అని, ఓటరుగా నమోదు కాపడం కర్తవ్యమని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో ఓటు హక్కుపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్ కుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి

టెక్కలి: మండలంలోని అక్కువరం పంచాయతీ పరిధి శ్యాంసుంద్రాపురానికి చెందిన రైతులకు తమ పంట పొలాలకు అవసరమైన సాగునీరు నీరు అందించాలని రైతులు కోరారు. ఈ మేరకు బుధవారం ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. వంశధార 46 కాలువ నుంచి మేఘవరం వరకు దగ్గర తిర్లంగి రైల్వే ట్రాక్ వరకు పనుల చేపట్టారని అన్నారు. ఆ తర్వాత కాలువల్లో పూడికతీత పనులు చేపట్టలేదని వివరించారు. దీనివల్ల సాగునీరు సరఫరా కాకపోవడంతో తమ పంట పొలాలు ఎండిపోయే దశకు వచ్చాయని తెలిపారు. ఇదే విషయమై గతంలో ఫిర్యాదు చేసిన స్పందించలేదని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే వంశధార పూడికతీత పనులు పనులు పూర్తిచేయాలని రైతులు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో పొట్నూరు అప్పలనాయుడు, నాగేశ్వరరావు స్రవంతి, ఢిల్లేశ్వరరావు, చంద్రకళ, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

15 తర్వాత పరీక్షలు నిర్వహించాలి

శ్రీకాకుళం సిటీ: విద్యార్థులు ఎంతో సరదాగా జరుపుకునే ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నాలుగు రోజుల ముందు ఫార్మేటివ్ పరీక్షలను నిర్వహించడం సమంజసం కాదని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 14 వరకు ఫార్మేటివ్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ అధికారుల తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. సకాలంలో ఎస్సెస్మెంట్ పుస్తకాలను పూర్తిస్థాయిలో విద్యార్థులకు అందజేయలేక ఆగస్టు 4 నుంచి ప్రారంభం కావాల్సిన ఫార్మేటివ్ పరీక్షలను వాయిదా వేసిన అధికారులు విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆటలాడుకుంటు న్నారన్నారు. విద్యాశాఖ అధికారులు పునరాలోచన చేసి ఆగస్టు 15 తర్వాత పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాలు మేరకు ఎంటి సూర్యనారాయణ ఆధ్వర్యాన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు బుధవారం చేశారు. స్టాల్‌కు సంబంధించిన కూరగాయలు మొఖలింగం, భూదేవి ఎటిఎం మోడల్ ద్వారా తెచ్చారు. వంగ, కాకర, అరటి కాయలు, అరటి పళ్లు, తోటకూర, గోంగూర, ముల్లంగి, మునగకాయలు, సారకంద, కొబ్బరి కాయలు, చిక్కుడు, బీర, బెండ బాగా అమ్మకాలు చేశారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, యూనిట్ ఇన్‌ఛార్జి రవి, ఐసిఆర్‌పి చిన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

డిగ్రీ విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా కోర్సుల్లో మార్పులు అవసరంగా ఫాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ ఆర్.శివకుమార్ అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) బుధవారం కెరీర్ అవేర్‌నెస్ ఇంటర్న్‌షిఫ్ పోగ్రాంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టులు, కార్పొరేట్ ట్రైనింగ్‌లు, కన్సల్టింగ్ సేవలు, ఇండస్ట్రీ సహకారం, జాబ్ ప్లేస్‌మెంట్‌లు వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన అవసరమని చెప్పారు. ప్రస్తుతం విద్యార్థుల్లో నైపుణ్యాలు అవసరమన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌కు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖిలో బిఎ హిస్టరీ విద్యార్థిని నందిని పేదలకు సేవ చేయాలనే తన అభిప్రాయాన్ని వెల్లడించడంతో శివకుమార్

ఎంఒయు పత్రాలను ప్రదర్శిస్తున్న ప్రతినిధులు

ఆమెకు నగదు బహుమతి అందించి, ఆ మొత్తంతో పేదలకు సహాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఇలాంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శిగా నిలవాలని, విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల యాజమాన్యం ఫ్రాంక్లిన్ టెక్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మధ్య ఎంఒయు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, అవకాశాలు, పరిశ్రమ అనుభవం అందుబాటులోకి రానున్నాయి.

అర్హులకు అన్నదాత సుఖీభవ వర్తించాలి

మాట్లాడుతున్న తహశీల్దార్ శ్రీనువాసరావు

లావేరు: అర్హులైన రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది కృషి చేయాలని తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వర శ్రీనువాసరావు రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఒలు, విఎఎలు, విహెచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,800 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించక రిజెక్ట్ అయ్యాయని, ఒన్‌బికి ఆధార్ లింక్ అవ్వకపోవడం, ఆధార్ నెంబర్లు తప్పు, మృతి చెందిన వారు తదితర కారణాలతో తిరస్కరించిన వాటిని సరిచేసి తిరిగి దరఖాస్తు చేస్తే ఇటువంటి వారందరికీ అక్టోబర్ నెలలో రెండోవిడత అన్నదాత సుఖీభవ పథకంలో న్యాయం జరుగుతుందని చెప్పారు. త్వరితగతిన చేయాలని ఆదేశించారు. మండలంలో 21 గ్రామాల్లో రీసర్వే పూర్తయిన 18 గ్రామాల్లోని 1300 జాయింట్ ఎల్‌బిఎం నెంబర్లు సరి చేయాలని, గ్రామాల్లో ప్రభుత్వ భూములు గుర్తింపు, వాటి బౌండిరీలు, స్పిరిట్ చేయాలని చెప్పారు. రైతులకు ఎరువుల పంపిణీ విషయంలో విఎఎలు, విఆర్‌ఒలు సంయుక్తంగా రైతులకు పంపిణీ చేయాలని చెప్పారు. ఈ-పంట నమోదు త్వరితగతిన పొలాల్లో తిరిగి పంట నమోదు చేయాలని ఎఒ డి.మహేష్‌నాయుడుకు చెప్పారు. సమావేశంలో డిటి డి. శ్రీనువాసరావు, ఎఇఒ ప్రమీల, ఆర్ఐ రాపర్తి అప్పలరాజు, సీనియర్ సహాయకులు రత్నాకర్, విఆర్‌ఒలు, విఎఎలు, విహెచ్‌లు పాల్గొన్నారు.

మోసాలతో కూటమి పాలన

బూర్జ: బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం అల్లెనలో వైసిపి మండల అధ్యక్షులు కె.గోవిందరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి సక్రమంగా నిర్వహించడం లేదని, దీనిపై ప్రజలు గ్రామ సచివాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోతుందన్నారు. ఇచ్చిన ప్రతిఒక్క హామీ అమలు చేసేంత వరకు ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వంతో పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి కరణం కృష్ణంనాయుడు, ఎంపిపి ప్రతినిధి కె.నాగేశ్వరరావు,

మోసాలపై ప్రజలకు వివరిస్తున్న నాయకులు

స్థానిక సర్పంచ్ జడ్డు మహేశ్వరరావు, జడ్డు రమానంద్, జనార్దనరావు, పట్టాభినాయుడు, శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాల చైర్మన్ కొంచాడ శేషగిరిరావు, హెచ్‌ఎం సిహెచ్ శారదాంబ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు గొండు జనార్దనరావు, తమ్మయ్యగారి జ్యోతి, పైడి వెంకట రామకృష్ణ, మెట్ట భాస్కరరావులను దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ పాఠశాలకు వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: పాఠశాలకు ఉపాధ్యాయులు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటామని సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు అన్నారు. గరుడభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్ల ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ బి.రేవతి, ప్రధానోపాధ్యాయులు వందన, రుద్రమూర్తి, సురేష్, కోదండరావు, మోహన్, సుజాత, పార్వతి పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని మాణిక్యపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొంతకాలంగా విధులు నిర్వహించి, ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఇఒలు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ

పొందూరు : బదిలీ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చైర్మన్ తదితరులు

మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషి వల్లే ఒక పాఠశాల పేరు ప్రఖ్యాతులు సంపాదిస్తుందని అన్నారు. మాణిక్యపురం పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఉపాధ్యాయునీ పాత్ర అమోఘమన్నారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని అమలపాడు ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులకు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు, హెచ్‌ఎం బి.వి.సాయిరాం సన్మానించారు.

మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చైర్మన్ గిరిబాబు

తాగునీటి సరఫరాకు చర్యలు

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి సరఫరా అవుతున్న పైపులైన్ మరమతులకు గురికావడంతో నీరు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తాగునీటికి సంబంధించి పైపులైను పద్మనాభపురం వద్ద చేపడుతున్న మరమ్మతు పనులను బుధవారం పరిశీలించారు. త్వరితగతిన పనులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, డిఇ కనకరాజు ఎఇ కిరణ్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

కార్యవర్గ సభ్యులతో లక్ష్మీనారాయణ

మున్సిపాలిటీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో సిఐటియు జిల్లా కార్యదర్శి సంగారు లక్ష్మీనారాయణ ఆధ్వర్యాన బుధవారం అవుట్ సోర్సింగ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షునిగా ఎ.రమేష్ కుమార్ పట్నాయక్, కార్యదర్శిగా ఢిల్లి పుండే, ఉపాధ్యక్షునిగా హుద్ది బోమద్ది, సహాయ కార్యదర్శిగా డి.లక్ష్మణరావు, కోశాధికారిగా ఎన్.హరికృష్ణ, సభ్యులుగా సంతోష్ పుండి, నరేందర్ రాతో, బృందావన్, పి.వి.ని.సత్తు, బాలరాజు, దునియా, రవి ప్రసాద్, లిమాయి, కృష్ణారావు, అన్నమయ్య, టి. జనార్ధన, డి.శ్రీకాంత్, దుర్గాసి సత్యం ఎన్నిక య్యారు. నూతన్ కార్యవర్గం కార్మికుల సమస్యలు పరిష్కారానికి చిత్త శుద్ధితో కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

ప్రజాశక్తి- సోంపేట

విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సంగారు లక్ష్మీనారాయన, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.నారాయణస్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి విద్యుత్ ఎఇ కార్యాలయం వరకు వామపక్షాల ఆధ్వర్యాన బుధవారం ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని, యువగళం పాదయాత్రలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారని గుర్తు చేశారు.

అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ప్రయోజనాలను పక్కనపెట్టి ఆదానీ ప్రయోజనాల కోసం స్మార్ట్ మీటర్ పెట్టి ప్రజలపై భారాలు వేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కె.గోపీనాథ్, గిరిజన సంఘం నాయకులు జయరాం, సిఐటియు నాయకులు గస్యా రఘునాథ్, బి.కామయ్య, జయరాం, వరుణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ నియామకం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని గుడివీధిలో ఉన్న శ్రీ ఉమారుంద్ర కోటేశ్వర స్వామి ఆలయం నూతన కమిటీని బుధవారం నియమించారు. చైర్మన్‌గా పాండ్రంకి దేవేంద్ర నాయుడు, సభ్యులుగా కోరాడ రమేష్, కోరాడ అరుణ, జంపాన శివరామరాజు, పిట్టా గురుచరణ్, పంతులు శేఖర్, కటారి కమల, పడిలాపి అమరావతి, సాలిహుండం శ్రీదేవిలను నియమించారు. ఆలయ ప్రగతికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు.

చినుకు పడదు.. నీరు రాదు

ఎండుతున్న వరి పంట

ప్రజాశక్తి- నరసన్నపేట

ఈ ఏడాది రుతుపవనాలు ముందు వచ్చాయి, నీరు కరువు ఉండదని, జూన్ మొదటి వారంలోనే రైతాంగం ఆనందం వ్యక్తం చేశారు. ఆ ఆనందం ఎంతోకాలం నిలవలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్, జూలై మొదటి వారంలో వర్షాలు పడటం వల్ల రైతులు ఎదలు వేశారు. కొన్ని ప్రాంతాల్లో వరి నారు పోసి ఉడుపులు ఉడిశారు. పోలాకి మండలంలో 20 వేల ఎకరాల విస్తీర్ణంలో సుమారు 80 శాతం ఎదలు వేశారు. ఇప్పుడు నడి వేసవిని తలపిస్తుంది. వేడి, ఎండలు ఎక్కువ కావడంతో అవి ఎండిపోతున్నాయి. వంశధార కాలువల్లో నీరు రాకపోవడంతో వరి నారు మాడిమసి పోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పోలాకి మండలంలో జమ్ము కూడలి నుంచి 16డి వంశధార కాలువ ద్వారా రావాల్సిన నీరంతంత మాత్రమే వస్తుంది. వీటివల్ల చీడివలస, జిల్లెడివలస, మాకివలస, చెల్లాయివలస, జడూరు, వై.వి.వలస, గాతలవలస, అలాగే 15డి వంశధార కాలువ ద్వారా రావాల్సిన నీరు అంతంత మాత్రమే

ఎండుతున్న వరి పంట

వస్తుంది. దీనివల్ల అంబీరుపేట, సుసరాం ఇలా అనేక గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం పోలాకి మండలానికి రావాల్సిన నీరు కిందకు వదలకుండా ఎగువ భాగంలో ఉన్న లింగాలవలస, చిన్న దూగాం, జమ్ము తదితర ప్రాంతాల్లో రైతులు కాలువుకు అడ్డంగా పూనులు వేశారు. అలాగే కాలువల్లో కొన్నిచోట్ల గుర్రపు డెక్క దట్టంగా ఉంటడంతో నీరు రావడం లేదని సుసరాం, గాతలవలస, వై.బి.వలస, మాకివలస, చెల్లాయి వలస, జడూరు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వంశధార అధికారులు స్పందించి కాలువల్లో నీరు వచ్చేటట్టు చర్యలు తీసుకోవాలని రైతులు ముక్తాకంఠంతో కోరుతున్నారు.

పోలాకి మండలం అంబీరుపేట గ్రామ పరిధిలోగల వ్యవసాయ భూములు నీరు లేక ఎడారులుగా మారాయి. ఈ పరిసర ప్రాంత రైతులు వరి నారు కోసం విత్తనాలు పోసినప్పటికీ వర్షాలు లేక, వంశధార ఉరజాం డిస్ట్రిబ్యూటరీ ఛానల్ నుంచి నీరు రాకపోవడంతో వరి నారు ఎండిపోయే స్థితికి చేరుకు చేరుకుందని నీటి సంఘం మాజీ అధ్యక్షులు సంపతరావు రామన్న ఆవేదన వ్యక్తం చేశారు గతంలో కాలువ మరమ్మతుల కారణంగా నీటిని విడుదల చేయలేకపోయామని, నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలని కోరారు.

ఈ విషయంపై జెఇ ప్రకాష్‌ని వివరణ కోరగా, ఎగువ భాగంలో రైతులు ఎవరూ ఆపలేదని, కానీ, గుర్రపుడెక్క దట్టంగా ఉంటడంతో నీరు రావడం లేదని అన్నారు. రెండు రోజుల్లో ప్రొక్లెయినర్ ద్వారా శుభ్రం చేస్తామని తెలిపారు.

యుద్ధం వద్దు.. శాంతి కోరుదాం

మాట్లాడుతున్న జెవివి రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

ప్రజాశక్తి- ఆముదాలవలస

హిరోషిమా నగరంపై జరిగిన అణు బాంబు దాడిని గుర్తిస్తూ ప్రతి సంవత్సరం ఆగస్టు 6న నిర్వహించే హిరోషిమా డే సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా హిరోషిమా నగరంపై జరిపిన అణు బాంబు దాడి మానవాళి చరిత్రలో భయానక ఘట్టమని యుద్ధాల వల్ల ఎంత భారీ నష్టం జరుగుతుందో కళ్లకు కట్టినట్లు చూపించిందని అన్నారు. ఈ దాడి రోజును ప్రపంచ వ్యాప్తంగా హిరోషిమా డేగా పాటిస్తూ యుద్ధానికి వ్యతిరేకంగా శాంతికి మద్దతుగా పెద్దఎత్తున ఉద్యమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో ఇజ్రాయిల్-పాలస్తీనా సంఘర్షణ రష్యా – ఉక్రెయిన్ యుద్ధం వంటి ఘటనలతో మానవాళికి పెరిగిన ముప్పుపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సామ్రాజ్యవాద దేశమైన అమెరికా తన స్వార్థ ప్రయోజనాల కోసం ఈ యుద్ధాలను ప్రోత్సహిస్తోందని కానీ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు శాంతిని కోరుతున్నారని, యుద్ధం ఎప్పుడూ నాశనానికే దారితీస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులు 'యుద్ధం వద్దు – శాంతి కావాలి' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జెవివి నాయకులు పి.మోహనరావు, పి.రామస్వామి నాయుడు, బిఎ శివరాజ్, షేక్ షావలి, టి.మనోహర్, సిహెచ్ సుబ్బలక్ష్మి, జి.కుమారి, ఎం.ఉమా కుమారి, ఎస్.సులోచనారాణి, ఎం.వి.ఆర్ బట్లు తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై సమీక్ష

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక రైతు సేవా కేంద్రం- 2 వద్ద జిల్లా ఐసిటి ఎన్ఎఫ్ఎ శివకృష్ణ, డివిజన్ ఎం.టి.సూర్యనారాయణ ఆధ్వర్యాన నవధ్యాన్యాల ప్రగతిపై బుధవారం సమీక్షించారు. జులై నెలలో సాధించిన ప్రగతిపైన యూనిట్ వారీగా సమీక్షించారు. ఆగస్టు నెలలో పంటలకు అనుగుణంగా నిల్వ ఉన్న కషాయలు తయారీ చేసి ఉంచాలని సిబ్బందికి చెప్పారు. అలానే యూనిట్కి జీడి మామిడి తోటలో నవధాన్యాలు సాగుచేయాలని, వాటి ద్వారా వచ్చిన విత్తనాలు రాబోయే రబీ సీజన్కు వాడుకోవాలని సిబ్బందికి సూచించారు. అలానే గులిరాగిలో అంతర పంటలు వచ్చే విధంగా ప్లాన్ చేసుకోవాలన్నారు. అలాగే ఉర్వి ఆఫ్లో నవధాన్యాలు ఎంట్రీ, కెపిఎ ఎంట్రీ ఎంత వరకు అప్డేట్ చేశారో, యూనిట్ వారిగా అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది తన సొంత పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. సమావేశంలో మండలాల యూనిట్ ఇన్ఛార్జీలు, ఐసిఆర్పిలు, డిజిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఈశ్వర్

'ది గోల్ ఇంజిన్'పై అవగాహన

ఇచ్ఛాపురం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జెసిఐ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన విద్యార్థులకు 'ది గోల్ ఇంజిన్' అనే అంశంపై జోన్ వన్ ట్రైనర్ ఈశ్వర్ బుధవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మన లక్ష్యాలను సాధించేందుకు మన ఆలోచన దృక్పథం ఎలా మార్చుకోవాలి, లక్ష్యం సాధించేందుకు మానసిక స్థితి ఎలా మెరుగుపర్చాలని అనే అంశాలను విషదీకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జెసిఐ ప్రెసిడెంట్ కాళ్ల జయదేవ్ సెక్రటరీ మోహన్, వెంకటేష్, షణ్ముఖ, సంతోష్ సాహు, అధ్యాపకులు లోకేష్, ఎన్సిసి పిఒ సంతోష్ కుమార్, బృందావనం పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న దాసురాజు

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారిపై ఇటీవల కూలిపోయిన కల్వర్టు నిర్మాణ పనులను సర్పంచ్ దాసురాజు ధనలక్ష్మి బుధవారం ప్రారంభించారు. కల్వర్టు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సర్పంచ్ భర్త దాసురాజు ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడిని కలిసి సమస్యపై వినతిపత్రం అందజేశారు. కల్వర్టు కూలిపోవడంతో వందలాది మంది గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, త్వరితగతిన నిర్మించాలని కోరారు. దీంతో స్పందించిన మంత్రి రూ.25 లక్షలు ఎన్ఆర్జిఎస్ నిధులు మంజూరు చేశారు. గ్రామస్తుల సమస్యను తక్షణమే పరిష్కరించిన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాసరచన పోటీలకు స్పందన

ఇచ్ఛాపురం: రోటరీ క్లబ్ ఆధ్వర్యాన పట్టణంలోని అన్ని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చేతి రాత, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీలో ఎం.షర్మిలాదేవి, వైష్ణవి పండా, ఎన్.ఎం.జెలీనాలు, ప్రత్యేక బహుమతులు వి.లక్ష్మీనారాయణ, చంద్ర లహరి గెలుపొందారు. చేతి రాత పోటీలో రెహాన్స్ సాహు, ఎస్.రేష్మి, ఎల్.జాస్మిత్, వ్యాసరచనలో జి.కౌసల్య, కె.పూజా, అంబటి చరిష్మారెడ్డి, ప్రత్యేక బహుమతి గిన్ని శైలజ గెలుపొందారు. ఈ పోటీలకు 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోటరీక్లబ్ ప్రతినిధులు డాక్టర్ మోహన్, వెంకటేష్, కె.రామారావు, బత్తుల షణ్ముఖ, పైడిశెట్టి దినేష్, కృష్ణారావు, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, మాటూరి నవీన్ పాల్గొన్నారు.

ఉక్కపోతలోనే విద్యార్థులకు పాఠాలు

తరగతి గదిలో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్లుగా ఉక్కపోతలోనే పలు తరగతులకు చెందిన విద్యార్థులు పాఠాలు అభ్యసిస్తూ నానా అవస్థలు పడుతూ అల్లాడిపోతున్నారు. గత ప్రభుత్వం హయాంలో నాడు - నేడు పనుల్లో భాగంగా రెండు తరగతి భవనాలను నిర్మించారు. ఈ భవనాలు పూర్తయినప్పటికీ వాటికి రంగులతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించ లేదు. అసంపూర్తిగా ఉన్న ఈ తరగతి గదుల్లోనే మూడు, నాలుగు తరగతులకు చెందిన విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నారు. ఈ తరగతి గదుల్లో కనీసం ఫ్యాన్ల సౌకర్యం లేకపోవడంతో ఉక్కపోతతో ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసిస్తున్నారు. ఈ తరగతి గదులు పైఅంతస్తులో ఉండడంతో శ్లాబ్ వేడితో పాటు ఉక్కపోతతో నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇటీవల పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ప్రశ్నించారు. అయినా దీనిపై ఇప్పటివరకూ ఆ సమస్య పరిష్కారంపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని డోలగోవిందపురం, పాలేరు రైతు సేవా కేంద్రాల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు భవానీశంకర్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఒ సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక పాల్గొన్నారు.

సోంపేట : మండలంలోని తాళభద్ర, మామిడిపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఎఒ బి.నరసింహమూర్తి నిర్వహించారు. వరి నారు పరిశీలించి రైతులతో ప్రస్తుతం నెలకొని ఉన్న సాగు పరిస్థితిపై చర్చించారు. కార్యక్రమాల్లో రైతులు, వ్యవసాయ సహాయకులు గణేష్, మాధురి పాల్గొన్నారు.

కవిటి: వ్యవసాయ రంగంలో సాంకేతికతను తప్పనిసరిగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఎడిఎ భవానీశంకర్ తెలిపారు. ఈ మేరకు జగతిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రోన్ ద్వారా స్ప్రేయింగ్ చేసే విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎఒ శ్రీదేవి, ఉద్యానశాఖ అధికారి మాధవీలత, సర్పంచ్ పూడి వరప్రసాద్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకళ్యాణ్, విహెచ్ఎ రాధ పాల్గొన్నారు.

కవిటి : డ్రోన్పై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ

పోలీస్స్టేషన్ వద్ద నిరసన

కొత్తూరు: మండలంలోని శోభనాపురానికి చెందిన గెల్లంకి వెంకటరమణ క్వారీలో పేలుళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ నెల 1న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇది ఇలా ఉండగా క్వారీలో పనిచేస్తున్న భైరి సుధాకర్ క్వారీలోని వస్తువులను వెంకటరమణ ధ్వంసం చేశాడని ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ వెంకటరమణను ఆదివారం పిలిపించి విషయం అడిగి తెలుసుకున్నారు. పోలీసులతో వెంకటరమణ దురుసుగా ప్రవర్తించారు. దీంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నారు. ఈ సమయంలో ఎస్ఐ వెంకటరమణపై లాఠీతో కొట్టడంతో గాయపడ్డాడు. దీంతో శోభనపురం గ్రామస్తులు బుధవారం పోలీస్స్టేషన్ చేరుకొని నిరసన తెలిపారు. వెంకటరమణ శ్రీకాకుళం రిమ్స్లో చికిత్స పొందుతున్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురంలోని బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అశోక్ పాణిగ్రాహి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఒరియా బ్రాహ్మణ అర్చక సంక్షేమ సంఘం ప్రతినిధులు బుధవారం రూ.1.10 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు గాంధీజీ పాణిగ్రాహి, సింహాచలం పాడి, రమేష్ కుమార్ పాణిగ్రాహి, కూర్మనాథ పాణిగ్రాహి, మురళి పాణిగ్రాహి, అశోక్రావు, విజయనాథ్ పాణిగ్రాహి, యుగంధర్ పాణిగ్రాహి, జయరాం పాణిగ్రాహి, జగన్నాథ పాణిగ్రాహి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: దండుగోపాలపురం జెడ్పి హైస్కూల్ ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి మండలం వేణు వైద్య ఖర్చులకు తోటి విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. గత కొద్దిరోజులుగా బోన్మారో వ్యాధితో బాధపడుతున్న తన మిత్రుడి కోసం ముందుకొచ్చి రూ.12,100 విరాళాలు సేకరించి వైద్య సాయంగా అందజేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న విదేశాల్లోని సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, బెండి రామరాజు ఆధ్వర్యాన జనసేన మిత్ర బృందం రెండు రోజుల్లోనే రూ.లక్ష విరాళాలు సేకరించి బాధితుని తండ్రి ఖాతాలో జమ చేశారు. విద్యార్థుల చేసిన సహాయానికి హెచ్ఎం గంగన్న, ఉపాధ్యాయులు భాస్కరరావు, శ్రీనివాసరావు, తిరుపతిరావు, సూర్యప్రకాష్ అభినందించారు.

అథ్లెటిక్స్ పోటీలకు పయనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞానభారతి విద్యార్థులు సిబిఎస్ఇ క్లస్టర్-7 అథ్లెటిక్ పోటీలకు విద్యార్థులు తరలివెళ్లారు. ఏడుగురు బాలురు, నలుగురు బాలికలు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, కానుపూరు అక్షర విద్యాలయ సిబిఎస్ఇ పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న విద్యార్థులను పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వహణ అధికారి జోహార్ఖాన్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్కుమార్, ట్రాన్స్పోర్టు మేనేజర్ అలీమ్ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా, రామచంద్రారెడ్డి అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించి, జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు..

పయనమవుతున్న క్రీడాకారులు

అవగాహన కల్పిస్తున్న డివిఇఒ దుర్గారావు

ఇంటర్ విద్యలో మార్పులపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాదిలో వచ్చిన మార్పులు, మారిన సిలబస్పై విద్యార్థులకు అవగాహన కల్పించి ఆ దిశగా వారిని సన్నద్ధం చేయాలని ఇంటర్ విద్య ఇన్ఛార్జీ డివిఇఒ దుర్గారావు అధ్యాపకులకు సూచించారు. పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం సందర్శించారు. ప్రణాళికాబద్ధ బోధనతో మంచి ఫలితాల దిశగా శ్రమించాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకొని సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలని విద్యార్థులకు హితవుపలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కుప్పిలి నరసింహమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలను తెలుసుకుంటున్న ఎఇ శశిభూషణరావు

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

నౌపడ పంచాయతీ పాలవానిపేట లోవోల్టేజీ సమస్యకు ప్రత్యేక ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని ఎఇ శశిభూషణరావు తెలిపారు. విద్యుత్ సమస్యలతో బాధపడుతున్నామని మంగళవారం రాత్రి సబ్స్టేషన్ వద్ద గ్రామస్తులు మహిళలు నిరసన తెలియజేశారు. దీనిపై స్పందించిన టెక్కలి ఇఇ నర్సింహకుమార్ సూచనలు మేరకు పాలవానిపేటలో పర్యటించారు. గ్రామస్తులు నుంచి సమస్యలు విన్న ఎఇ మరో రెండు వారాల్లో పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయనతోపాటు టిడిపి నాయకులు సుగ్గు శాంతిస్వరూప రెడ్డి, గ్రామస్తులు దాలయ్య, ఎస్.రవి, ఎస్.నాగిరెడ్డి, తేజేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

మాజీ మంత్రిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి మండల నాయకులు కోరారు. ఈ మేరకు ఎఎస్ఐ జయంతరావుకు బుధవారం లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అప్పలరాజు ఈనెల 5న పత్రిక సమావేశంలో ఎమ్మెల్యే గౌతు శిరీషపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకొనే విధంగా ఉన్నాయని అన్నారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా ఘోరమైన పదాలు వాడి మనోవేదనకు గురి చేశారన్నారు. విచారణ చేపట్టి తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సురాడ మోహనరావు, గోరకల వసంతరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు కణితి సురేష్ చౌదరి, పుచ్చ ఈశ్వరరావు, పి.సాంబమూర్తి, అరసవల్లి ఉమామహేష్, అంబటి రామకృష్ణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.